
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రంగారెడ్డి
5 జిల్లా వార్తలు
గురువారం 29 ఫిబ్రవరి 2024



ఎమ్మెల్యే యాదయ్య ఆరోపణలు సరికాదు

శంకర్‌పల్లి, ఫిబ్రవరి 28 : ఎమ్మెల్యే యాదయ్య తనపై చేస్తున్న ఆరోపణలు సరికాదని, ఆయన మాట్లాడేముందు తానేంటో గుర్తు చేసుకోవాలని శంకర్‌పల్లి మున్సిపాలిటీ వైస్‌చైర్మన్ వెంకట్‌రాంరెడ్డి మండిపడ్డారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు వేరే పార్టీలో చేరేముందు పదవులకు రాజీనామా చేయాలన్న ఎమ్మెల్యే చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నట్లు తెలిపారు. గతంలో కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచి అభివృద్ధి పేరుతో బీఆర్‌ఎస్‌లో చేరి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయకుండా తానే బాగుపడ్డాడని విమర్శించారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

- మొదటి రోజు 772 మంది గైర్హాజర్
- ఒక్క నిమిషం నిబంధనతో ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకున్న విద్యార్థులు
- పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు సౌకర్యాల ఏర్పాటు
- విద్యార్థుల కోసం ప్రత్యేక బస్సులు నడిపిన ఆర్టీసీ
- పరీక్షకు హాజరయ్యే వారికి ఉచిత ప్రయాణ సౌకర్యం



ఇంటర్ విద్యార్థుల పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభమయ్యాయి. పరీక్షలకు అధికారులు అన్ని రకాల ఏర్పాట్లు చేశారు. ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్షకు అనుమతించబోమని అధికారులు చెప్పడంతో అందరూ పరీక్ష సమయానికి ముందే చేరుకున్నారు. ఆర్టీసీ అధికారులు పరీక్ష కేంద్రాలకు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించారు. దీంతో వారు పరీక్ష కేంద్రాలకు సకాలంలో చేరుకునేందుకు ఇబ్బంది లేకుండా పోయింది. మొత్తానికి మొదటి రోజు పరీక్ష ప్రశాంతంగా ముగిసింది.



చేవెళ్లలో పరీక్ష రాసేందుకు వచ్చిన విద్యార్థులు



షాద్‌నగర్‌లో జూనియర్ కాలేజీలో విద్యార్థుల సందడి



ఇబ్రహీంపట్నంలో హాల్‌టికెట్లు చెక్ చేస్తున్న లెక్చరర్

ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 28 : ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు తొలి రోజు బుధవారం ప్రశాంతంగా జరిగాయి. ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యార్థులు పరీక్షలు రాశారు. జిల్లాలోని 195 పరీక్ష కేంద్రాల్లో 78,153 మంది విద్యార్థులు మొదటి సంవత్సరం పరీక్షలు రాయాల్సి ఉండగా 77,381 మంది మాత్రమే హాజరయ్యారు. 772 మంది పరీక్షలకు హాజరు కాలేకపోయారు. జిల్లాలోని 37 పోలీస్‌స్టేషన్లలో భద్రపరిచిన ప్రశ్నపత్రాలను భారీ బందోబస్తు మధ్యన పరీక్ష కేంద్రాలకు తరలించారు. ఒక్క నిమిషం ఆలస్యం అయినా అనుమతి లేదనే నిబంధన విధించడంతో విద్యార్థులు నిర్దేశించిన సమయానికి అరగంట ముందుగా పరీక్ష కేంద్రానికి చేరుకున్నారు. ప్రతీ విద్యార్థిని క్షుణ్ణంగా చెక్ చేసి పరీక్ష హాల్లోకి అనుమతించారు. సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలను పరీక్ష హాల్లోకి తీసుకు వెళ్లనీయకుండా చర్యలు తీసుకున్నారు. సీసీ కెమెరాల నిఘాలో ప్రశ్నపత్రాల సీల్‌ను తొలగించి విద్యార్థులకు అందించారు. మాస్ కాపీయింగ్, మాల్ ప్రాక్టీసుకు తావు లేకుండా చర్యలు తీసుకున్నారు. అక్రమాలకు తావు లేకుండా ప్రతి కేంద్రంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. 22మంది ఫ్లయింగ్ స్క్వాడ్, అరుగురు సిట్టింగ్ స్క్వాడ్స్ ఎప్పటికప్పుడు తనిఖీలు చేపట్టారు. పరీక్ష కేంద్రాలకు దగ్గరలో ఉన్న జిరాక్స్ షాపులను మూసి వేసేలా ర్యలు తీసుకుంటున్నారు. ప్రతీ పరీక్ష కేంద్రం పరిసరాల్లో 144 సెక్షన్ అమలులో ఉంచారు. పరీక్ష కేంద్రాలకు సమీపంలో జిరాక్స్ సెంటర్లను పోలీసు శాఖ మూసి వేయించింది. విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు చేరుకోవడానికి టీఎస్ ఆర్టీసీ ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది. పరీక్ష కేంద్రాలకు వెళ్లేందుకు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించింది. పరీక్షా కేంద్రాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకున్నారు. కేంద్రాల్లో విద్యార్థులకు తాగునీటిని అందుబాటులో ఉంచారు. కేంద్రాల వద్ద ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ఇతర మందులతో పాటు ఏఎన్ఎం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నారు.

పరీక్షకు హాజరైన విద్యార్థుల వివరాలు

	జనరల్	ఒకేషనల్	మొత్తం
హాజరు కావాల్సిన విద్యార్థులు	73,944	4,209	78,153
హాజరైన విద్యార్థులు	73,446	3,935	77,381
గైర్హాజరు	498	274	772



చేవెళ్లలో హాల్‌టికెట్ నెంబర్లు చూసుకుంటున్న విద్యార్థినులు





చేవెళ్ల జూనియర్ కాలేజీలో పరీక్ష రాసేందుకు వచ్చిన విద్యార్థులు



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- కలెక్టరేట్ వద్ద ధర్నా, డీఈవోకు వినతిపత్రం అందజేత

రంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 28 : మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని మధ్యాహ్న భోజన కార్మికులు డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న 5 నెలల బిల్లులు ఇవ్వాలని, ప్రభుత్వం పెంచిన ప్రకారం రూ.3 వేలు గౌరవ వేతనం, పెండింగ్‌లో ఉన్న 4 నెలల వేతనాలు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన కార్మికులు జిల్లా కలెక్టరేట్ ఎదుట బుధవారం ధర్నా చేపట్టారు. సమస్యలను పరిష్కరించాలని కోరుతూ డీఈవో సుశీందర్‌రావుకు వినతిపత్రం సమర్పించారు. ఈ ధర్నాలో మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమ, జిల్లా అధ్యక్షురాలు అలివేలు, జిల్లా ప్రధాన కార్యదర్శి యెలోని స్వప్న, జిల్లా కోశాధికారి సిహెచ్ సరిత, జిల్లా ఉపాధ్యక్షురాలు గణేష్, జిల్లా సహాయ కార్యదర్శి శ్రీను, జిల్లా ఉపాధ్యక్షుడు నర్సింహా, నాయకులు పద్మ, లక్ష్మి, ఎల్లేష్, బుగ్గరాములు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి చంద్రమోహన్ తదితరలు పాల్గొన్నారు.

ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

మొయినాబాద్ రూరల్, ఫిబ్రవరి 28 : రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో చేవెళ్ల ఎంపీ సీటును గెలువడమే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని వికారాబాద్ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పట్నం సునీతా మహేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం నగరంలోని ఆమె నివాసంలో బీఆర్‌ఎస్ పార్టీ మొయినాబాద్ మండలాధ్యక్షుడు మహేందర్‌రెడ్డి తన అనుచరులతో కలిసి ఆమెను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో ప్రజలకు తాను చేసిందేమీ లేదని.. ఎన్నో అవమానాలను భరించానని ఆవేదన వ్యక్తం చేశారు. వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో కార్యకర్తలు కష్టపడి పనిచేయాలని కోరారు. అభివృద్ధి కోసమే బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వచ్చానని తెలిపారు. ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ తాను బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేసి త్వరలో కాంగ్రెస్‌లో చేరబోతున్నట్లు తెలిపారు. సునీతా మహేందర్‌రెడ్డిని కలిసిన వారిలో సీనియర్ నాయకులు కీసరి సంజీవరెడ్డి, ఈగ రవీందర్ రెడ్డి, యాలాల జైపాల్‌రెడ్డి, మనోజ్, బాల్‌రాజ్ ఉన్నారు.



మొయినాబాద్ నాయకులతో వికారాబాద్ జడ్పీ చైర్‌పర్సన్ సునీత

వేదాద్రి లక్ష్మీనరసింహస్వామి దేవాలయం బ్రహ్మోత్సవాలకు ముస్తాబు

- మార్చి 5 నుంచి 7 వరకు నిర్వహణ
- 7న స్వామివారి కల్యాణం



బ్రహ్మోత్సవాలకు ముస్తాబవుతున్న దేవాలయం



స్వామి వారి మూలవిరాట్

తలకొండపల్లి, ఫిబ్రవరి 28: వెల్జాల గ్రామ సమీపంలో వెలసిన శ్రీ వేదాద్రి లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయం బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. ఈ దేవాలయంలో ప్రతి ఏటా బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. ఐదు రోజుల పాటు నిర్వహించే ఉత్సవాలకు నిర్వాహకులు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. మార్చి 5 నుంచి 7వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు కొనసాగుతాయి. బ్రహ్మోత్సవాలలో భాగంగా మార్చి 5న గణపతి పూజ, అఖండ దీపారాధన, లక్షపుష్పార్చన, ప్రదోశ పూజ, స్వస్తివాచనం, గోపూజ, 6న గణపతి పూజ, రక్షాబంధనం, దీక్షాధారణ యాగశాల ప్రవేశం, మంటపారాధనలు, సుదర్శన హోమం, సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు, పుష్పార్చన, ప్రదోశ పూజ, దీక్షితుల సుబ్రమణ్యంచే అన్నమయ్య సంకీర్తనలు, వేద పండితులు సూర్యనారయాణ మూర్తి ప్రవచనాలు, 7న స్వామివారి కల్యాణం, మహాదీపారాధన, స్వామివారి పలకీ సేవ కార్యక్రమాలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. బ్రహ్మోత్సవాలలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆలయ ప్రధాన ధర్మకర్త గూడ యాదగిరి నృసంహి శర్మ, మాజీ ఎంపీపీ సీఎల్ శ్రీనివాస్ యాదవ్, ఎంపీటీసీ సభ్యుడు అంబాజీ, పీఏసీఎస్ వైస్ చైర్మన్ కూన రవి భక్తులకు విజ్ఞప్తి చేశారు.

ఎన్నికల కోడ్ అమల్లో ఉంది.. ప్రజాప్రతినిధులు సహకరించాలి

- సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ శశాంక
- షాద్‌నగర్ ఎంపీపీ కార్యాలయంలో పోలింగ్ కేంద్రం ఏర్పాటు
- స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానానికి పోలింగ్



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ శశాంక

ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 28 : రాజకీయ పార్టీలు, నాయకులు, ప్రజలంతా పార్లమెంట్ ఎన్నికల వైపు దృష్టి సారిస్తుండగా ఊహించని విధంగా ఎన్నికల సంఘం స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు నోటిఫికేషన్ విడుదల చేసింది. ఉమ్మడి మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ఉంటూ కల్వకుర్తి ఎమ్మెల్యేగా ఎన్నిక కావడంతో కసిరెడ్డి నారాయణరెడ్డి ఎమ్మెల్సీ స్థానానికి ఆయన రాజీనామా చేశారు. దీంతో ఎన్నికల సంఘం ఈ స్థానానికి మార్చి 28న ఎన్నికలు నిర్వహించనుంది. ఇందుకు సంబంధించి వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ శశాంక బుధవారం కొంగరకలాన్‌లోని కలెక్టరేట్‌లో సమీక్షా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు సంబంధించి జిల్లాలో ఎన్నికల కోడ్ అమలులో ఉందని, ప్రజాప్రతినిధులు సహకరించాలని కలెక్టర్ అన్నారు. ఈ నెల 26వ తేదీన మహబుబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసినట్లు చెప్పారు. అదే రోజు నుండి ఎన్నికల కోడ్ వర్తింస్తుందన్నారు. ఉప ఎన్నికకు సంబంధించిన నోటిఫికేషన్ మార్చి 4న ఎన్నికల సంఘం విడుదల చేయనున్నట్లు తెలిపారు. షెడ్యూల్ విడుదలతో మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల నియోజకవర్గ శాసనమండలి పరిధిలోని మహబూబ్‌నగర్, నారాయణపేట, జోగులాంబ గద్వాల, నాగర్‌కర్నూల్, వనపర్తి, వికారాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో ఎన్నికల కోడ్ తక్షణం అమలులోకి వచ్చిందని తెలిపారు. షెడ్యూల్ ప్రకారం మార్చి 4వ తేదీన నోటిఫికేషన్ జారీ, నామినేషన్లకు తుది గడువు మార్చి 11, మార్చి 12న నామినేషన్ల పరిశీలన, నామినేషన్ల ఉపసంహరణకు మార్చి 14 తుది గడువు, మార్చి 28న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు పోలింగ్, ఏప్రిల్ 4న ఓట్ల లెక్కింపు ఉంటుంది. ఏప్రిల్ 4వ తేదీతో ఎన్నికల ప్రక్రియ ముగుస్తుందని కలెక్టర్ తెలిపారు.

మార్చి 4: నోటిఫికేషన్ జారీ
మార్చి 11: నామినేషన్‌కు తుది గడవు
మార్చి 12: నామినేషన్ల పరిశీలన
మార్చి 14: నామినేషన్ల ఉపసంహరణకు తుది గడువు
మార్చి 28: ఉదయం 8 గంటల నుంచి సాయంత్ర 4గంటల వరకు పోలింగ్,
ఏప్రిల్ 4: ఓట్ల లెక్కింపు,
ఏప్రిల్ 4వ తేదీతో ఎన్నికల ప్రక్రియ ముగింపు

జిల్లాలో అమల్లోకి ఎన్నికల కోడ్..

జిల్లాలో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిందని కలెక్టర్ శశాంక తెలిపారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ (ఎంసీసీ) నిబంధనలు, ఫ్లయింగ్ స్క్వాడ్, సర్విలియాన్ టీంల బాధ్యతలను తెలియజేశారు. అసెంబ్లీ ఎన్నికల మాదిరిగానే ఎన్నికల కోడ్ వర్తిస్తుందని, కోడ్ ఉల్లంఘించకుండా రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలన్నారు. జిల్లాలో ఎఫ్ఎస్టీ, ఎస్ఎస్‌టీ, వీఎస్టీల టీములను కూడా ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. త్వరలో టోల్ ఫ్రీ నెంబర్ అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు. ఈ సమావేశంలో మహ్మద్ అబ్దుల్ బారీ, జహంగీర్ ఖాన్, సాయితేజ (కాంగ్రెస్), ఎన్.జగదీశ్వర్ (బీఆర్‌ఎస్)తో పాటు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల విభాగం అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల వివరాలు..

జడ్పీటీసీలు : 10
ఎంపీటీసీలు : 104
కౌన్సిలర్లు 55
ఎక్స్‌అఫీషియో (ఎమ్మెల్యే/ఎంపీ) : 02
మొత్తం : 171

పది మండలాల్లో 171 మంది ఓటర్లు..

జిల్లాలో పది మండలాలకు (అమనగల్, ఫరూఖ్‌నగర్, కేశంపేట్, కొందుర్గు, కొత్తూరు, మాడ్గుల, తలకొండపల్లి, చౌదరిగూడెం, నందిగామ, కడ్తాల్) సంబంధించి 171 మంది ఓటర్లు ఉన్నారు. షాద్‌నగర్‌లోని ఎంపీపీ కార్యాలయంలో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ శశాంక తెలిపారు.

కల్వకుర్తి నియోజకవర్గంలో ఎన్నికల సందడి

ఆమనగల్లు: మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం విడుదల చేసింది. దీంతో కల్వకుర్తి నియోజకరవ్గంలో ఎమ్మెల్సీ ఎన్నికల సందడి మొదలైంది. 2022లో స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా బీఆర్ఎస్ నుంచి ఎన్నికైన కసిరెడ్డి నారాయణ రెడ్డి అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఆ పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరారు. అనంతరం ఎమ్మెల్యేగా పోటీచేసి విజయం సాధించారు. దీంతో ఆయన ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయడంతో ఇక్కడ ఉప ఎన్నిక అనివార్యమైంది. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలకు ఆమనగల్లు మున్సిపాలిటీ, మండలంలో 21 ఓట్లు , మాడ్గుల మండలంలో 15, తలకొండపల్లి మండలంలో 13, కడ్తాల మండలంలో 11, కల్వకుర్తి మున్సిపాలిటీ, మండలంలో 35, వెల్దండ మండలంలో 13 ఓట్లున్నాయి. ఓటర్లలో ఆరుగురు జడ్పీటీసీ సభ్యులు, 37 మంది మున్సిపల్ కౌన్సిలర్లు, 64 మంది ఎంపీటీసీ సభ్యులు, ఒక ఎమ్మెల్యే ఉన్నారు. కాగా ఎమ్మెల్సీ అభ్యర్థిత్వాల కోసం ప్రధాన పార్టీలైన బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్‌ల నుంచి పలువురు నాయకులు అప్పుడే ప్రయత్నాలు ప్రారంభించారు. కాంగ్రెస్‌లో పోటీ ఎక్కువగా ఉంది. ఇదిలా ఉండగా కల్వకుర్తి నియోజకవర్గంలో మెజార్టీ ఓట్లు బీఆర్ఎస్‌కే ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ తీవ్రస్థాయిలో ఉండేటట్లు కన్పిస్తుంది. తమ పదవీ కాలం ముగియనున్న తరుణంలో ఎమ్మెల్సీ ఎన్నికలు రావడంతో ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, కౌన్సిలర్లు సంతోషంగా ఉన్నారు.

వరికి తెగుళ్లు సోకే ప్రమాదం

- రైతులు అప్రమత్తంగా ఉండాలి
- పంటలపై దృష్టి సారించాలి
- గుర్తింపు పొందిన షాపుల్లోనే ఎరువులు, మందులు కొనాలి



షాబాద్, ఫిబ్రవరి 28 : వరి పంటకు ఎరువులు వాడాం కదా.. పంట పచ్చగానే ఉందని రైతులు అజాగ్రత్తగా ఉండొద్దని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. రాబోయే రోజుల్లో వరికి తెగుళ్ల సోకే ప్రమాదం మెండుగా ఉందని, అందుకోసం ముందు జాగ్రత్తగా మండల వ్యవసాయాధికారి వెంకటేశం రైతులకు పలు సూచనలు చేశారు. వరి సాగు మొదట్లోనే తెగులు సోకి పంట ఎదుగుదల లోపించిందని, సూచించిన మందులను పిచికారీ చేయాలని అధికారులు రైతులకు చెబుతున్నారు. ప్రస్తుతం అగ్గి తెగులు కోసం ట్రైసైక్లోజల్, కాండం కుళ్లకు ఎగ్జాకొనజోల్, కాండం తొలుచు పురుగు కోసం కార్టప్‌హైడ్రోక్లోరైడ్‌ను వాడాలని రైతులకు తెలియజేశారు. రాబోయే రోజుల్లో మానిపండు, దోమ, ఆకుపచ్చ తెగుళ్ల సోకే అవకాశం ఉందని, ప్రతీరోజు రైతులు పంటను పరిశీలించాలన్నారు. మితిమీరి యూరియాను వాడొద్దని రైతులకు సూచించారు.

సర్టిఫై చేసిన మందులనే వాడాలి..

సర్టిఫై చేసిన మందులనే వాడాలని, పలువురు గ్రామాల్లో తిరుగుతూ అమ్మే ఎరువులు మంచివో, కావో రైతులు గుర్తించాలని అధికారులు సూచిస్తున్నారు. వరి తెగులు సోకితే ఆ మందులు, ఈ మందులు వాడితే సరిపోతుందని, ఎవరైనా చెబితే వినొద్దని చెబుతున్నారు.

సూచనలు పాటించాలి



వ్యవసాయాధికారుల సూచన మేరకు రైతులు మందులు వాడాలి. ఇష్టమొచ్చిన మందులు వాడొద్దు. పంట బాగానే ఉందని అజాగ్రత్తగా ఉంటే ప్రమాదం. పంటను ఎప్పుడూ గమనిస్తుండాలి. తెగులు సోకితే ఏఈవోలను సంప్రదించాలి.

- వెంకటేశం, మండల వ్యవసాయాధికారి, షాబాద్

‘మా భూములను స్వాధీనం చేసుకోవద్దు’

బొంరాస్‌పేట్, ఫిబ్రవరి 28: దుద్యాల మండలం హకీంపేట్, పోలెపల్లి, లగచర్ల గ్రామాల్లో మందుల కంపెనీలకు తమ భూములను స్వాధీనం చేసుకోవద్దని ఆ గ్రామాల ప్రజలు అన్నారు. బుధవారం సీఎం రేవంత్‌రెడ్డికి రాసిన లేఖను దుద్యాల తహసీల్దార్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ప్రజలు మాట్లాడుతూ మందుల కంపెనీలను సాగు భూముల్లో కాకుండా ప్రభుత్వ, బంజరు భూముల్లో ఏర్పాటు చేయాలని కోరారు. కంపెనీల ఏర్పాటుతో భూములపై ఆధారపడి జీవిస్తున్న తమ నోట్లో మట్టి కొట్టొద్దని అన్నారు.

పన్నులు చెల్లించి అభివృద్ధికి సహకరించండి

పరిగి, ఫిబ్రవరి 28: మునిసిపల్ పరిధి ప్రజలు ఆస్తి పన్ను చెల్లించి పరిగి పట్టణ అభివృద్ధికి సహకరించాలని మున్సిపల్ కమిషనర్ వెంకటయ్య కోరారు. బుధవారం ఆయన మాట్లాడుతూ గత ఏడాది పెండింగ్‌లో పన్నులతో కలిపి మొత్తం రూ.2.4కోట్లు ప్రజలు చెల్లించాల్సి ఉందన్నారు. ఏటా రూ.1.5కోట్ల పన్ను రాబడి రావాల్సి ఉందన్నారు. ఇప్పటి వరకు రూ.90లక్షల వసూలు జరిగిందని తెలిపారు. కోటిన్నర పన్నులు చెల్లించాల్సి ఉందని తెలిపారు. మార్చి ఆఖరు నాటికి వందశాతం పన్నులు వసూలు చేసేలా స్పెషల్ డ్రైవ్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇంటింటికి తిరిగి వసూలు చేసూలు చేసే కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఇంటి, వ్యాపార పన్నులు కూడా చెల్లించాలని సూచించారు. గడువులో చెల్లించిన వారికి నోటీసులు ఇస్తామని, వాటికి కూడా స్పందించకపోతే ఆస్తులను జప్తు చేస్తామని కమిషనర్ స్పష్టం చేశారు. స్వచ్ఛందంగా ముందుకు వచ్చి చెల్లించాలని ఆయన పట్టణవాసులను కోరారు.

రూ.23.35కోట్లతో దమ్మాయిగూడ మున్సిపల్ బడ్జెట్



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ ఛైర్‌పర్సన్ వసుపతి ప్రణీత

కీసర రూరల్, ఫిబ్రవరి 28: దమ్మాయిగూడ మున్సిపాలిటీని అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ ఛైర్‌పర్సన్ వసుపతి ప్రణీత అన్నారు. బుధవారం మున్సిపల్ బడ్జెట్ సమావేశాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ.23.35కోట్ల బడ్జెట్‌కు కౌన్సిల్ తీర్మానించిందన్నారు. పన్నుల ద్వారా రూ.8.2కోట్లు, ఇళ్ల నిర్మాణ అనుమతులు, వ్యాపార లైసెన్సులు, తదితరాల ద్వారా రూ.13.72కోట్లు, 15వ ఆర్థిక సంఘ నిధులు రూ.90లక్షలు,ఇతర మార్గాల ద్వారా మొత్తం రూ.23.35కోట్ల ఆదాయం సమకూరుతుందని అంచనా వేశామన్నారు. ఈ మొత్తాన్ని హరితహారం నిర్వహణ, ఉద్యోగులు, సిబ్బంది వేతనాలు, వివిధ అభివృద్ధి పనులు, బీసీ సంక్షేమానికి, పరిపాలన ఇంజినీరింగ్ నిర్వహణ తదితరాలకు వెచ్చిస్తామని ఆమె వివరించారు. కార్యక్రమంలో వైస్ ఛైర్మన్ మాదిరెడ్డి నరేందర్‌రెడ్డి, కమిషనర్ రాజమల్లయ్య, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు

మేడ్చల్ పారిశ్రామిక వాడ సబ్‌స్టేషన్‌లో 11కేవీ ఫీడర్ ప్రారంభం

మేడ్చల్ టౌన్, ఫిబ్రవరి 28 : మేడ్చల్ పారిశ్రామిక వాడలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో 11కేవీ ఫీడర్‌ను విద్యుత్ శాఖ సీజీఎం సాయిబాబ బుధవారం ప్రారంభించారు. వినియోగదారులకు అంతరాయం లేకుండా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు నూతనంగా ఫీడర్ ఏర్పాటు చేశామని ఈ సందర్భంగా సాయిబాబ తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఈ శ్రీరాంమోహన్, శ్రీనాథ్ రెడ్డి, ఏడీఈ, ఏఈ, విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



విద్యుత్ ఫీడర్‌ను ప్రారంభిస్తున్న సీజీఎం సాయిబాబ

నేటి నుంచి జినుగుర్తిలో ప్రతిష్ఠాపనోత్సవాలు

తాండూరు రూరల్, ఫిబ్రవరి 28 : తాండూరు మండలం జినుగుర్తిలో సింధూర గణపతి ఆలయ ప్రారంభోత్సవం, శిఖర ప్రతిష్ఠాపన కార్యక్రమాలు గురువారం నుంచి మార్చి 2వ తేదీ వరకు జరుగుతాయని ఆలయ కమిటీ బుధవారం తెలిపింది. నేడు గణపతి పూజతో పూజలు ప్రారంభం అవుతాయన్నారు.







ఆర్. కృష్ణయ్యతో పట్నం దంపతుల భేటీ



కృష్ణయ్యతో పట్నం దంపతులు, నాయకులు

వికారాబాద్, ఫిబ్రవరి 28 : బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్యతో ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి బుధవారం హైదరాబాద్‌లోని విద్యానగర్‌లో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ప్రస్తుత రాజకీయాలపై చర్చ జరిపారు. తాను కూడా వికారాబాద్ జిల్లా వాస్తవ్యుడినేనని, పట్నం కుటుంబంతో తనకు అవినాభావ సంబంధాలు ఉన్నాయని కృష్ణయ్య చెప్పారు. పట్నం దంపతులు ఎప్పుడూ ప్రజాసేవలో ఉంటారని ఆయన కొనియాడారు. ఈ సందర్భంగా కృష్ణయ్యను పట్నం దంపతులు సన్మానించారు. బీసీ సంఘం నాయకుడు లాల్‌కృష్ణ, తదితరులు ఉన్నారు.

బీఆర్‌ఎస్‌కు ఇన్‌చార్జి ఎంపీపీ సునీతా అంధ్యానాయక్ రాజీనామా



మాట్లాడుతున్న సునీతా అంధ్యానాయక్

మహేశ్వరం, ఫిబ్రవరి 28 : మహేశ్వరం మండల ఇన్‌చార్జి ఎంపీపీగా కొనసాగుతున్న ఆర్. సునీతాఅంధ్యానాయక్ బీఆర్‌ఎస్ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి బుధవారం రాజీనామ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ ఛాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి సబితాఇంద్రారెడ్డిపై గౌరవంతో బీఆర్‌ఎస్‌లో కొనసాగామని చెప్పారు. కానీ మండలంలో పలువురు బీఆర్‌ఎస్ నాయకులు తమను అడుగడుగునా అవమానాలకు గురి చేశారని, దీంతో తీవ్ర మనస్థాపానికి గురై పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నామన్నామని ప్రకటించారు. త్వరలో కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నామని వారు ప్రకటించారు.

భూ వివాదాల్లో పోలీసుల జోక్యం ఉండదు

- వికారాబాద్ జిల్లా ఎస్పీ ఎన్.కోటిరెడ్డి



పోలీస్ వార్షిక బులెటిన్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్పీ

దోమ, వికారాబాద్, ఫిబ్రవరి 28: భూవివాదాలు, సివిల్ తగాదాల్లో పోలీసుల జోక్యం ఉండదని వికారాబాద్ జిల్లా ఎస్పీ ఎన్.కోటిరెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలియజేశారు. అటువంటి వాటిని కోర్టు ద్వారా పరిష్కరించుకోవాలని, కోర్టు, రెవెన్యూ డిపార్ట్‌మెంట్ నుంచి లిఖితపూర్వకంగా ఆదేశాలు ఉంటేనే తమ ప్రమేయం ఉంటుందని చెప్పారు. వికారాబాద్ జిల్లా పరిగి డివిజన్ దోమ మండలంలోని తిమ్మాయిపల్లి గ్రామ శివారులోని సర్వే నెం.50/ఏ/1లో గల మొత్తం 1.09 ఎకరాల భూమిని 2018వ సంవత్సరంలో ఉదాన్‌రావుపల్లి గ్రామానికి చెందిన సయ్యద్ అయూబ్ అనే వ్యక్తి తిమ్మాయిపల్లి గ్రామానికి చెందిన చీమ రాములమ్మ దగ్గరి నుంచి కొనుగోలు చేశాడన్నారు. కానీ కబ్జాలోకి వెళ్లలేదని, ఇట్టి భూమి విషయంలో చీమ రాములమ్మ, ఆమె కుటుంబ సభ్యులు, సయ్యద్ అయూబ్‌కు మధ్య తగాదాలు జరుగుతున్నాయన్నారు. 2021 ఆగస్టు 2న ఆగ్రామానికి చెందిన సత్తయ్య ఫిర్యాదుతో రాములమ్మ, ఆమె కుటుంబ సభ్యులపై దోమ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసి జైలుకు పంపించడం జరిగిందన్నారు. వారు జైలులో ఉన్న సమయంలో అయూబ్ అట్టి భూమి చుట్టు కడీలు పాతారని చెప్పారు. వారు జైలు నుంచి విడుదలయ్యాక ఆ పొలంలోకి వెళ్లి వ్యవసాయం చేయడం, రాములమ్మ కుమారుడు చీమ గోవర్ధన్ చనిపోవడంతో అతని మృతదేహాన్ని పొలంలో పూడ్చిపెట్టడం జరిగిందన్నారు. తిరిగి 2024 ఫిబ్రవరి 5న ఆ భూమి విషయంలో గొడవలు జరగడంతో సయ్యద్ అయూబ్ దోమ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కేసు ప్రస్తుతం కోర్టు విచారణలో ఉందని చెప్పారు. భూవివాదాలు, సివిల్ తగాదాల్లో పోలీసుల జోక్యం ఉండదని కోర్టుల ద్వారానే పరిష్కరించుకోవాలన్నారు. అయితే కొంత మంది ప్రజా సంఘాల నాయకులు వారి స్వలాభం కోసం అట్టి భూమిని అయూబ్‌కు కబ్జా ఇప్పించాలని పోలీసులపై వత్తిడి తీసుకువస్తూ, పోలీసులపై తప్పుడు ఆరోపణలు చేయిస్తూ తమను కించపరిచే విధంగా కథనాలు, అవాస్తవాలు ప్రచురిస్తున్నారని చెప్పారు. పోలీసులపై తప్పుడు కథనాలు, అవాస్తవాలు ప్రచురిస్తున్న వారికి, యాజమాన్యానికి నోటీసులు ఇచ్చి, పరువు నష్టం కేసులతో చట్ట రీత్యా చర్యలు తీసుకుంటామన్నారు.

పోలీస్ వార్షిక బులెటిన్ ఆవిష్కరణ

వికారాబాద్ : వికారాబాద్ జిల్లా పోలీసులు 2023 సంవత్సరంలో చేధించిన కేసులు, సాధించిన లక్ష్యాలు, చేపట్టిన అవగాహన కార్యక్రమాలు, వారు చేసిన మంచి పనులు తదితర విషయాలతో రూపొందించిన వార్షిక బులెటిన్‌ను ఎస్పీ కోటిరెడ్డి బుధవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ రవీందర్‌రెడ్డి, ఏవో జోతిర్మనీ, వర్టికల్ డీఎస్పీ జానయ్య, ఏఆర్ డీఎస్పీ వీరేశ్, డీసీబీ ఇన్‌స్పెక్టర్ రాజు, ఐటీసీటీ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్, సీఐ చంద్రశేఖర్‌రెడ్డి, ఆర్ఐ అంజాత్ పాషా, ఎస్సైరాధిక, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తుది దశకు మల్కాజ్‌గిరి ఎంపీ అభ్యర్థి కసరత్తు!

- చర్చనీయాంశంగా ఈటల బ్రేక్‌ఫాస్ట్ మీటింగ్

మేడ్చల్ ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మల్కాజిగిరి పార్లమెంటు స్థానానికి బీజేపీ అభ్యర్థుల కసరత్తు తుది దశకు చేరుకుంది. ఒకట్రెండు రోజుల్లో అభ్యర్థి పేరును ప్రకటించనున్నట్లు ఆ పార్టీ వర్గాలు వెల్లడించాయి. ఇప్పటికే మల్కాజిగిరి ఎంపీ స్థానానికి దాదాపు అరడజను మంది పోటీలో ఉండగా, వివిధ సర్వే నివేదికలతో తుది పేరును ఎంపికచేయనున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర నాయకుడొకరు వెల్లడించారు. ఇప్పటి వరకు మల్కాజిగిరి పార్లమెంటు స్థానంపై పాగా వేయని బీజేపీ ఈ దఫా ఎలాగైనా కైవసం చేసుకోవాలని ఆ పార్టీ నేతలు భావిస్తున్నారు. కాగా మల్కాజిగిరి పార్లమెంటు స్థానంలో పోటీ చేసేందుకు బీజేపీలో తీవ్ర పోటీ నెలకొన్న విషయం విదితమే. కాగా బుధవారం ఆ పార్టీ నేత ఈటెల రాజేందర్ ఓఆర్ఆర్ పక్కన పూడూరు పరిధిలోని తన నివాసంలో కార్యకర్తలకు బ్రేక్ ఫాస్ట్ మీటింగ్ ఏర్పాటు చేయడం ఆ పార్టీలో తీవ్ర చర్చనీయాంశమైంది. మల్కాజిగిరి టికెట్ తనదేనంటూ ఈటెల బ్రేక్‌ఫాస్ట్ మీటింగ్ ఏర్పాటు చేశారనే ప్రచారం జోరందుకోవడంతో అధిష్టానం ప్రకటించకముందే టికెట్ తనకేనని ఈటెల ఎలా ప్రకటించుకుంటాడంటూ ఇతర ఆశావహులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.. ఈటల ఇంటి వద్ద ప్రతి రోజు కార్యకర్తలకు బ్రేక్ ఫాస్ట్ ఉంటుందని లేనిపోని ప్రచారాలు చేస్తున్నారని ఈటల మద్దతుదారులు కొట్టి పరేశారు. బుధవారం ఈటెల నివాసం వద్ద మాత్రం కార్యకర్తలతో పెద్ద ఎత్తున కోలాహలం నెలకోవడం గమనార్హం.



ఈటెల నివాసం వద్ద అభిమానుల కోలాహలం

బీఆర్‌ఎస్‌కు పనిచేసిన నాయకులొద్దు



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

యాలాల, ఫిబ్రవరి 28 : అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ కోసం పనిచేసి ఎన్నికలయ్యాక కాంగ్రెస్ పార్టీలో చేరే నాయకులు తమకు అవసరం లేదని యాలాల మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నారు. బుధవారం కేంద్రంలోని బాకార ఆంజనేయస్వామి దేవాలయం ఆవరణలో తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అనుచరులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో మండలానికి చెందిన మాజీ ఎంపీపీ కరణం పురుషోత్తంరావు, మాజీ జడ్పీటీసీ సిద్రాల శ్రీనివాస్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి రోహిత్‌రెడ్డి కోసం పనిచేశారని చెప్పారు. ఆయన ఓడిపోవడంతో వారి స్వార్థం కోసమే చేవెళ్ళలో జరిగిన ముఖ్యమంత్రి సభలో వారిద్దరూ కాంగ్రెస్‌లో చేరారని విమర్శించారు. కనీసం ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డికి సమాచారం ఇవ్వలేదని, వారి చేరికతో పార్టీకి ఏలాభం లేదని ఎద్దేవా చేశారు. ఈ విషయాన్ని త్వరలోనే అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్తామని వారు తెలిపారు. సమావేశంలో పీఏసీఎస్ చైర్మన్ సురేందర్‌రెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు నర్సిరెడ్డి, అక్బర్‌బాబా, చెన్నారం అనిల్‌కుమార్, హనుమంతు, మనిద్దీన్ నాగయ్య, షైపాల్ ,అహ్మద్, వెంకటయ్య పాల్గొన్నారు.

తెలంగాణలో పురోగమనంలో పట్టు ఉత్పత్తి

- జిల్లా పట్టు పరిశ్రమల శాఖ అధికారి సత్తార్



మాట్లాడుతున్న ఉద్యాన, పట్టు పరిశ్రమల శాఖ అధికారి ఎంఏ సత్తార్

వికారాబాద్, ఫిబ్రవరి 28 : తెలంగాణలో పట్టు ఉత్పత్తి పురోగమనంలో ఉన్నదని జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమల శాఖ అధికారి ఎంఏ సత్తార్ అన్నారు. మంగళవారం ఆ శాఖ ఆధ్వర్యంలో పట్టు, మల్బరీ సాగుపై రైతులకు ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరికి ప్రత్యామ్నాయంగా మల్బరీ, కూరగాయల సాగు చేయాలని చెప్పారు. మల్బరీ బహువార్షిక పంట అని, తక్కువ నీటితో ఎక్కువ దిగుబడి వస్తుందని తెలిపారు. దాని వల్ల సంవత్సరంలో ఐదుగురికి ఉపాధి కల్పించవచ్చని అన్నారు. వికారాబాద్ ప్రాంతంలో మంచి ఎర్రచల్క భూములు ఉండడం ఉద్యాన పంటలకు అనుకూలిస్తుందని, హైదరాబాద్‌కి సమీపాన ఉన్నందున కూరగాయల సాగు కూడా చేపట్టవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు రాఘవేందర్, వినోద్‌కుమార్ యాదవ్, పట్టు పరిశ్రమశాఖ సహాయ సంచాలకులు మల్లికార్జున్, ఉద్యాన అధికారులు కలమ, జయంతి, అబ్దుల్ గఫూర్, అర్చన, పట్టు పరిశ్రమ శాఖ అధికారులు విజయ్‌కుమార్, తుయమని, రైతులు పాల్గొన్నారు.

డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్థం



ఇళ్ల సమీపంలో నిలిచిన మురుగునీరు

ధారూరు, ఫిబ్రవరి 28 : గ్రామాలలో సిమెంట్, కంకర రోడ్ల నిర్మాణానికే ప్రభుత్వం ప్రాధాన్యమిచ్చి, మురుగుకాల్వల నిర్మాణాన్ని విస్మరిస్తోందని ప్రజలు ఆరోపిస్తున్నారు. దీంతో నేటికీ గ్రామాలను డ్రైనేజీ సమస్య వెంటాడుతోంది. ఉపాధిహామీ పథకం ద్వారా రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మురికి కాల్వల నిర్మాణానికి నిధులు ఇవ్వటంలేదని పలువురు విమర్శిస్తున్నారు. మురుగుకాల్వలు లేకపోవడంతో మురుగు నీరు రోడ్లపై ప్రవహిస్తుండడంతో దుర్గంధం వ్యాపిస్తోంది. రోడ్లపై నిలువటంతో గుంతలు పడి రోడ్లు పాడవుతున్నాయి. మడుగులుగా మారి అపరిశుభ్రత నెలకొనడంతో పాదాచారులకు ఇబ్బంది కలుగుతోంది. దీంతో దోమలు, ఈగలు, క్రిమికీటకాలు వృద్ధి చెంది, మలేరియా, టైఫాయిడ్, డెంగీ, అతిసారా వంటి రోగాలతో ప్రజలు ఆసుపత్రుల పాలవుతున్నారు. కాగా మురుగుకాలువలు సరిగా లేక గ్రామాలలో పారిశుధ్యం నిర్వహణ ప్రజాప్రతినిధులకు, అధికారులకు సవాలుగా మారింది. ఎన్నికల ప్రచారానికి వచ్చిన పార్టీల నాయకులను గతంలో ఆయా గ్రామాల ప్రజలు ఈ సమస్యపై నిలదీసిన సంఘటనలు ఉన్నాయి. కాలువలు నిర్మించిన తర్వాతే రోడ్లను నిర్మించే వారని ప్రస్తుతం వాటి ఊసేలేదని ప్రజలు అంటున్నారు. గ్రామాలలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేసి మురుగు సమస్యను పరిష్కరించాలని ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

మురుగుకాల్వలు లేక రోగాలు



ధారూరులోని కుక్కింద రోడ్డులో ఉన్న మా కాలనీలో మురుగు కాలువలు లేకపోవడంతో మురుగు రోడ్లపై ప్రవహిస్తోంది. అపరిశుభ్రతతో కాలనీవాసులకు రోగాలు వస్తున్నాయి. మురుగునీరు ఇళ్ల మధ్య నిలిచి నడవటానికి ఇబ్బంది కలుగుతోంది. దోమలు, ఈగలు పెరగడం వల్ల రోగాలు వస్తున్నాయి. కాలువలు నిర్మించాలని ప్రజాప్రతినిధులు, అధికారులను పలు మార్లు కోరినా స్పందించటంలేదు.

- శ్రీకాంత్, ధారూరు

ఏ క్షణంలోనైనా.. కుప్పకూలే ప్రమాదం

- టాకీ తండాలో శిథిలావస్థకు చేరిన ఓహెచ్‌ఎస్ఆర్ ట్యాంక్
- అధికారులు పట్టించుకోవాలని విజ్ఞప్తి



శిథిలావస్థలో ఓహెచ్ఎస్ఆర్ ట్యాంక్

బషీరాబాద్, ఫిబ్రవరి 28 : మండల కేంద్రంలోని టాకీ తండాలోని ఓహెచ్‌ఎస్ఆర్ ట్యాంక్ శిథిలావస్థకు చేరింది. ఈ ట్యాంక్‌కు పగుళ్లు ఏర్పడి పెచ్చులూడుతుండడటంతో ఏ క్షణమైనా కుప్పకూలే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నాలుగు పిల్లర్లకు పలుచోట్ల పెచ్చులూడి ఇనుప రాడ్లు(చువ్వలు) కనిపిస్తున్నాయి. దీంతో ఎప్పుడేం జరుగుతుందోనని సమీప ఇళ్ల ప్రజలు భయం భయంగా కాలం గడుపుతున్నారు. నిత్యం ఈ ట్యాంకు ద్వారానే నీరు సరఫరా చేస్తుండటంతో లోడ్ ఎక్కువై కూలిపోయే ప్రమాదం ఉందని స్థానికులు వాపోతున్నారు. దీనికి సమీపంలోనే అంగన్‌వాడీకేంద్రం, ప్రాథమిక పాఠశాల ఉండటంతో చిన్నారులు ట్యాంకు కిందకు చేరుకుని ఆటలాడుతుంటారని స్థానికులు చెబుతున్నారు. ఏ ప్రమాదం జరుగకముందే తగిన చర్యలు తీసుకోవాలని మాజీ ఎంపీటీసీ నరేష్ చౌహాన్ సంబంధిత అధికారులను కోరారు. ఎమ్మెల్యే దృష్టికి కూడా తీసుకెళ్తామని, సంబంధిత అధికారులు వెంటనే స్పందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

విద్యార్థులు పట్టుదలతో చదువుకోవాలి

- జాతీయ సాహిత్య పరిషత్ సంఘటన్ కార్యదర్శి భాస్కరయోగి



మాట్లాడుతున్న భాస్కరయోగి

చేవెళ్ల, ఫిబ్రవరి 28 : విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో చదువుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని జాతీయ సాహిత్య పరిషత్ సంఘటన్ కార్యదర్శి భాస్కరయోగి అన్నారు. బుధవారం చేవెళ్ల పట్టణ కేంద్రంలోని కేజీఆర్ గార్డెన్‌లో జరిగిన సిల్వర్ డైల్ పాఠశాల వార్షికోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ విలువలతో కూడిన విద్య నేర్చుకోవాలని విద్యార్థులకు సూచించారు. నేటి ప్రపంచంలో సెల్‌ఫోన్‌ల వినియోగం పెరిందని ఆందోళన వ్యక్తం చేశారు. పాఠశాల విద్యార్థులు సెల్‌ఫోన్‌లకు దూరంగా ఉండేవిధంగా తల్లిదండ్రులు బాధ్యత తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థులు కష్టపడి చదువుకుని మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులు చదువులో మరింత ముందుకు రావాలన్నారు. పాఠశాల చైర్మన్ మోహనచారి, ప్రిన్సిపాల్ సునీతారెడ్డి, వివేకానంద జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జైపాల్‌రెడ్డి, చేవెళ్ల మాజీ సర్పంచ్ బండారు శైలజాఆగిరెడ్డి, బోజిరెడ్డి, రమణారెడ్డి, ఉపాధ్యాయులు కళ్యాణి, విద్యార్థిని, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తదితరులు ఉన్నారు.

ఇబ్రహీంపట్నం లయన్స్ క్లబ్‌కు అవార్డు



అవార్డు అందుకుంటున్న రమేష్‌రాజు

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 28 : ఇబ్రహీంపట్నం లయన్స్ క్లబ్ తరపున పలు సేవా కార్యక్రమాలు చేసిన సందర్భంగా క్లబ్ సెక్రటరీ కెవి రమేష్‌రాజు లయన్స్ క్లబ్ ఇంటర్నేషల్ 320సి రీజియన్ చైర్‌పర్సన్ లయన్ శ్యాం ప్రసాద్ చేతుల మీదుగా బుధవారం ఉత్తమ క్లబ్ అవార్డునందుకున్నారు. మున్ముందు మరిన్ని సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టాలని శ్యాంప్రసాద్ సూచించారు. కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ ఇందూరి శ్రీనివాస్, ట్రెజరర్ గుంటి భీంరావుతోపాటు క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలి



విద్యార్థులకు చెక్కులు అందజేస్తున్న రాము, రవీందర్‌రెడ్డి

షాబాద్, ఫిబ్రవరి 28 : పదోతరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని బీజేవైఎం స్వచ్ఛభారత్ సెల్ రాష్ట్ర కన్వీనర్ రాము, బీజేపీ సీనియర్ నాయకుడు రవీందర్‌రెడ్డి అన్నారు. జస్టిస్ కొండా మాధవరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని సర్దార్‌నగర్, పోతుగల్, తాళ్లపల్లి, హైతాబాద్, మన్మర్రి గ్రామాల్లో పదోతరగతి చదువుతున్న విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ. 2వేల 500 చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రతీ సంవత్సరం మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా ఇలాంటి సేవా కార్యక్రమాలు చేస్తున్నారన్నారు. విద్యార్థులు బాగా కష్టపడి ఉన్నత స్థాయికి ఎదగాలని చెప్పారు. కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా కార్యదర్శి మహేందర్, కిసాన్‌మోర్చా మండల అధ్యక్షుడు రవిగౌడ్, బీజేవైఎం మండల అధ్యక్షుడు మహేష్, నాయకులు ఉపేందర్, రవి, ప్రశాంత్, రఘు, రాములు, బిక్షపతి, లింగం, కిరణ్ పాల్గొన్నారు.

నియోజకవర్గంలో ఎమ్మెల్యే కసిరెడ్డి విస్తృత పర్యటన

ఆమనగల్లు, ఫిబ్రవరి 28 : కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి బుధవారం నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించారు. ఆమనగల్లు, కడ్తాల, తలకొండపల్లి, మాడ్గుల మండలాల్లో పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు వివాహ వేడుకల్లో పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. వేసవి నేపథ్యంలో తాగునీరు, విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చూడాలని అధికారులకు ఆదేశించారు. రోడ్డు ప్రమాదంలో గాయపడి హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కొల్కులపల్లి, నాగిళ్ల పాఠశాలల ఉపాధ్యాయులను ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పరామర్శించారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు నూదిని కొండల్ రెడ్డి, భట్టు కిషన్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, హన్మనాయక్, విజయ్‌రాథోడ్, వెంకటయ్య, శ్యామ్‌సుందర్ రెడ్డి, కృష్ణ, యాదయ్యగౌడ్, రాజేందర్ రెడ్డి, శివశంకర్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

ఇంటర్ పరీక్షలు ప్రారంభం

- ఉదయం 8 గంటలకే పరీక్ష కేంద్రాలకు విద్యార్థులు
- పకడ్బందీ ఏర్పాట్లు.. పోలీసుల బందోబస్తు


కందుకూరు : నేదునూరు ఆదర్శ పాఠశాలలో పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులు

ఆమనగల్లు , ఫిబ్రవరి 28 : ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు బుధవారం ప్రశాంతంగా జరిగాయి. పరీక్షల నేపథ్యంలో అధికారులు పకడ్బందీగా ఏర్పాట్లు చేశారు. ఆమనగల్లు, కడ్తాల మండల పరిధిలోని 4 కళాశాలలకు చెందిన ప్రథమ,ద్వితీయ సంవత్సర విద్యార్థుల కోసం ఆమనగల్లు పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్ష కేంద్రం ఏర్పాటు చేశారు.తొలి రోజు ఉదయం 8 గంటలకే విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. తొలిరోజు 375 మంది విద్యార్థులకుగాను 350 మంది హాజరయ్యారని పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్ వెంకటయ్య తెలిపారు. విద్యార్థులకు తాగునీటి వసతి కల్పించి, వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచారు. పరీక్ష కేంద్రం వద్ద పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

చేవెళ్ల : మండల కేంద్రంలో మొత్తం నాలుగు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 298 మంది విద్యార్థులకు 16 మంది గైర్హాజరయ్యారు. వివేకానంద జూనియర్ కళాశాలలో 291 మందికి ఐదుగురు, శ్రీ చైతన్య జూనియర్ కళాశాలలో 288 మందికి 12 మంది, చేవెళ్ల మోడల్ జూనియర్ కళాశాలలో 394 మంది విద్యార్థులకుగాను 33 మంది గైర్హాజరయ్యారు. 1197 మందికి 66 మంది గైర్హాజరైనట్లు కస్టోడియన్ నరేష్‌కుమార్ తెలిపారు.

మొయినాబాద్ రూరల్ : మండలంంలోని హిమాయత్ నగర్‌లోని ఎన్టీఆర్ కళాశాల, సిదార్థ ఇంటర్, డిగ్రీ కళాశాల, చాలెంజర్ ఇంటర్ నేషనల్ కళాశాలలతో పాటు తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పా ఠశాల(చిలుకూరు), మొయినాబాద్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ మైనార్టీ డిగ్రీ కళాశాలలోని పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. మొత్తం 1583 విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 1537 మంది హాజరయ్యారు.

షాద్‌నగర్ : షాద్‌నగర్ నియోజకవర్గ పరిధిలో ఇంటర్ ప్రథమ సంవత్సర పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమైనాయి. నియోజకవర్గ పరిధిలో 2376 మంది విద్యార్థులు ఉన్నారు. ఇందులో 147 మంది విద్యార్థులకు పరీక్షలకు గైర్హాజరయ్యారు. మొత్తం మీద 2229 మంది హాజరయ్యారు. ఈ సందర్భంగా పరీక్ష కేంద్రాల వద్ద పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.


ఇబ్రహీంపట్నం : జూనియర్ కళాశాల వద్ద విద్యార్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది

ఇబ్రహీంపట్నం : ఇబ్రహీంపట్నం పరిధిలో పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. మొత్తం 3731 మందికిగాను 3608 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. మండలాల వారీగా చూస్తే ఇబ్రహీంపట్నం మండల పరిధిలో మొత్తం ఏడు సెంటర్లలో 3063 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 2957 మంది హాజరయ్యారు. ఇబ్రహీంపట్నం ప్రభుత్వ జూనియర్ కళాశాల సెంటర్‌లో 495 మందికిగాను 467, సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ కళాశాలలో 417కు గాను 391, నల్లకంచె బాలికల రెసిడెన్షియల్‌లో 414కు గాను 401, వాసవి జూనియర్ కళాశాలలో 510కిగాను 494, వసుంధర జూనియర్ కళాశాలలో 368కి 366, విద్యాంజలి ఒకేషనల్ కళాశాలలో 473కు గాను 462, కార్తికేయ జూనియర్ కళాశాలలో 386 మందికి గాను 376మంది విద్యార్థులు పరీక్ష రాశారు. యాచారం మండలం గున్‌గల్ మోడల్ స్కూల్ సెంటర్‌లో 342మందికి 339మంది విద్యార్థులు, మంచాల జూనియర్ కళాశాల సెంటర్‌లో 326మందికిగాను 312 మంది పరీక్షలు రాశారు.


ఆమనగల్లు : జడ్పీహెచ్ఎస్(బాలుర) పరీక్ష కేంద్రం వద్ద పోలీసుల బందోబస్తు

కందుకూరు : మండలంలో పరిధిలో 1239 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. కందుకూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 308మంది విద్యార్థులు పరీక్ష రాయగా.. ఆరుగురు గైర్హాజరైనట్లు ప్రిన్సిపాల్ ఉమాదేవి తెలిపారు. నేదునూరు ఆదదర్శ జూనియర్ కళాశాలలో 537మందికి 22మంది గైర్హాజరైనట్లు ప్రిన్సిపాల్ బి.శ్రీధర్ తెలిపారు. మండల కేంద్రంలోని విద్యామహీ జూనియర్ కళాశాలలో 394మందికి ముగ్గురు గైరాజరైనట్లు ప్రిన్సిపాల్ బాల్‌రాజ్ తెలిపారు.

మాడ్గుల : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 140మంది విద్యార్థులకు గాను 135మంది హాజరయ్యారు. ఐదుగురు గైర్హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ శ్యామలదేవి తెలిపారు.

క్రైం కార్నర్

6 కిలోల గంజాయి స్వాధీనం

- నిందితుడి అరెస్ట్.. రిమాండ్‌కు తరలింపు

నందిగామ, ఫిబ్రవరి 28 : మండల కేంద్రం సమీపంలోని అయ్యప్పస్వామి ఆలయం వద్ద గంజాయి తరలిస్తున్న వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకుని 6కిలోల ఎండుగంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ వివరాల ప్రకారం ఒరిస్సాకు చెందిన మానస్ రంజన్ ప్రదాన్, వీరూపాక్షలు గంజాయి విక్రయిస్తున్నారనే సమాచారం బుధవారం నందిగామ పోలీసులు, ఎస్వోటీకి తెలిసింది. దాంతో అయ్యప్ప ఆలయం వద్ద మాటువేసి మానస్ రంజన్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. అతడి నుంచి 6.1కిలోగ్రాముల ఎండు గంజాయి స్వాధీనం చేసుకున్నారు. కాగా, దాని విలువ దాదాపు రూ.లక్షా20వేలు ఉంటుందని ఇన్‌స్పెక్టర్ తెలిపారు. మానస్ రంజన్‌ను అరెస్ట్‌చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

మాజీ ఎమ్మెల్యే ఫాంహౌస్‌లో పేకాట.. పోలీసుల దాడి.. పదిమందిపై కేసు

పూడూరు, ఫిబ్రవరి 28: మాజీ ఎమ్మెల్యే ఫాంహౌస్‌లో పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు పేకాట స్థావరంపై దాడి చేసి పది మందిపై కేసు నమోదు చేసినట్లు చెన్‌గోముల్ ఎస్ఐ మధుసూదనరెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా మేరకు బుధవారం పూడూరు సమీపంలో గల ఫాంహౌస్‌లో పేకాట ఆడుతున్న వారిని అదుపులోకి తీసుకొని రూ.50,990, పది సెల్‌ఫోన్లు, 3 కార్లు, 3 బైక్‌లను స్వాధీనం చేసుకున్నామని, కేసు దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.


గ్రామస్తులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

షాబాద్, ఫిబ్రవరి 28 : గ్రామీణ ప్రాంత ప్రజలు ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని తిర్మలాపూర్ మాజీ సర్పంచ్ శ్రీధర్‌రెడ్డి అన్నారు. బుధవారం షాబాద్‌మండల పరిధిలోని తిర్మలాపూర్‌లో పట్నం మహేందర్‌రెడ్డి ఆస్పత్రి ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించగా ఆయన ప్రారంభించారు. గ్రామానికి చెందిన 86 మందికి పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. గ్రామస్తులు దశరథరెడ్డి, జంగయ్య, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి కరాటే పోటీలకు షాద్‌నగర్ విద్యార్థి ఎంపిక

షాద్‌నగర్, ఫిబ్రవరి 28: మార్చి 3న ముంబైలో నిర్వహించే జాతీయ స్థాయి కుంగ్‌ఫూ కరాటే పోటీలకు షాద్‌నగర్ పట్టణంలోని కాకతీయ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నా ఓంకార్ ఎంపికయ్యాడు. కాగా, ఇటీవల నగరంలో రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించగా రంగారెడ్డి జిల్లా నుంచి 20 మంది విద్యార్థులు పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబర్చారు. ఇందులో భాగంగా షాద్‌నగర్ నుంచి ఓంకార్ ఎంపికయ్యాడు. బుధవారం పిన్సిపాల్ స్వాతిరెడ్డి, కరాటే కోచ్ బాల్‌రాజ్‌లు విద్యార్థి ఓంకార్‌ను అభినందించారు. జాతీయస్థాయిలో షాద్‌నగర్ పేరును నిలబెట్టాలని ప్రిన్సిపాల్ కోరారు.


ఓంకార్ అభినందిస్తున్న ప్రిన్సిపల్ స్వాతిరెడ్డి

ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం

- పాఠశాలల్లో సీవీ రామన్‌కు ఘన నివాళి
- ఆకట్టుకున్న విద్యార్థుల ప్రయోగాలు


ఆమనగల్లు : సీవీ రామన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఫరీద్, ఉపాధ్యాయులు


షాబాద్ : విద్యార్థుల ప్రయోగాలను పరిశీలిస్తున్న హెచ్‌ఎం సుధాకర్‌రెడ్డి

ఆమనగల్లు, ఫిబ్రవరి 28: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో బుధవారం జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలు, సీవీ రామన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎన్ఎస్‌యూఐ మండలాధ్యక్షుడు ఎండీ ఫరీద్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. రామన్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఫరీద్ పదో తరగతి విద్యార్థినిలకు ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో పరీక్ష ప్యాడ్లు, పెన్నులు పంపిణీ చేశారు. హెచ్‌ఎం రామలక్ష్మి, టీచర్లు ప్రేమకుమారి, పీఈటీ సుశీల, ఎన్ఎస్‌యూఐ నాయకులు మహేశ్, సిద్ధు, అబ్దుల్, రాహుల్, పవన్, గణేశ్, తదితరులున్నారు.

● **షాబాద్ :** విజ్ఞాన ప్రదర్శనలతోనే విద్యార్థుల మేధస్సు పెంపొందుతుందని మాంటిస్సోరీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సుధాకర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు చేసిన వివిధ ప్రయోగాలను పరిశీలించి ఉపయోగాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

చేవెళ్ల : విద్యార్థులు సైన్స్‌పట్ల మరింత ఆసక్తిని పెంచుకోవాలని సత్యసాయి పాఠశాల డైరెక్టర్ నల్ల నాయుడు అన్నారు. మండల కేంద్రంలోని పాఠశాలలో అకడమిక్ ఫెయిర్ సైన్స్ ఎగ్జిబిషన్‌ను ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల నైపుణ్యం వెలికి తీసేందుకు సైన్స్ ఎగ్జిబిషన్ చాలావరకు ఉపయోగపడుతుందన్నారు. విద్యార్థులు సైన్స్‌పట్ల ఆసక్తిని పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ స్నేహలత, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు ఉన్నారు.


కొందుర్గు : ప్రయోగం గురించి విద్యార్థిని అడిగి తెలుసుకుంటున్న ఎంఈవో కిష్టారెడ్డి

కేశంపేట : మండల పరిధిలోని నిర్దవెల్లి హైస్కూల్‌లో జాతీయ సైన్స్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు వివిధ రకాల ప్రయోగాలు చేసి వివరించారు. ఉత్తమ ప్రయోగాలు చేసిన విద్యార్థులకు ఉపాధ్యాయులు బహుమతులు అందించారు. అలాగే పాఠశాల సైన్స్ టీచర్ లతను విద్యార్థులు, ఉపాధ్యాయులు సన్మానించారు. జీహెచ్‌ఎం చంద్రశేఖర్‌రెడ్డి, కరుణాకర్‌గౌడ్, మహ్మద్ రజాక్, చంద్రశేఖర్, పీఈటీ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


చేవెళ్ల : సైన్స్ ఎగ్జిబిషన్‌లో విద్యార్థుల ప్రయోగాలను పరిశీలిస్తున్న ఉపాధ్యాయులు

షాద్‌నగర్ రూరల్ : నేటి విజ్ఞానమే రేపటి సాంకేతికతకు మూలమని, విద్యార్థులు సాంకేతికను పెంచుకోవాలని ఎంఈవో శంకర్ రాథోడ్ తెలిపారు. ఫరూఖ్‌నగర్ ఉన్నత పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రయోగాలు చేసి ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఆయన బహుమతులు అందించారు. అలాగే కమ్మదనం గురుకుల బాలికల పాఠశాలలో సైన్స్‌డేను జరుపుకున్నారు. కార్యక్రమాల్లో ప్రిన్సిపాల్ హేమలత, హెచ్‌ఎం పద్మశ్రీ ఉపాధ్యాయులున్నారు.

కొందుర్గు : మండల కేంద్రంలోని బాలికల ప్రాథమికోన్నత పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ప్రయోగాలు చేసి వివరించారు. ఉత్తమ ప్రయోగాలకు ఉపాధ్యాయులు బహుమతులు అందజేశారు. ఎంఈవో కిష్టారెడ్డి, ప్రధానోపాధ్యాయులు వెంకట్‌రెడ్డి, కానిస్టేబుళ్లు మహేశ్, లావణ్య, ఉపాధ్యాయులు ఉషశ్రీ, ప్రేమ్‌సాగర్ పాల్గొన్నారు.


కేశంపేట : నిర్దవెల్లిలో విద్యార్థుల ప్రయోగాలను పరిశీలిస్తున్న ఉపాధ్యాయులు


షాద్‌నగర్‌రూరల్ : విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న ఉపాధ్యాయులు

దశలవారీగా సమస్యలు పరిష్కరిస్తాం


బస్టాండ్‌లో ప్రయాణికులతో మాట్లాడుతున్న డీవీఎం సుచరిత

యాచారం, ఫిబ్రవరి 28 : దశలవారీగా యాచారం బస్టాండ్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తామని, అన్ని రకాల వసతులు కల్పిస్తామని హయత్‌నగర్ డివిజనల్ మేనేజర్ ఎన్.సుచరిత అన్నారు. బుధవారం యాచారం బస్టాండ్‌ను సందర్శించి ప్రయాణికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ముందుగా తాగునీటి సమస్యను తీర్చాలని డీఎం వెంకటనర్సప్పను ఆదేశించారు. రాత్రివేళ చీకటి ఉండడంతో విద్యుత్ వసతి కల్పించేందుకు అధికారులను ఆదేశించామన్నారు. బస్టాండ్‌లో ఉన్న రెండు షట్టర్లను అద్దెకిచ్చి సంస్థ ఆదాయం పెంపుకోసం కృషి చేస్తున్నట్లు చెప్పారు. తాగు నీటి ఎద్దడికి చర్యలు తీసుకుంటామని డీఎం చెప్పారు.

శంకర్‌పల్లి వైస్ ఎంపీపీగా ప్రవళికా వెంకట్‌రెడ్డి


ఎంపీటీసీ సభ్యులతో వైస్ ఎంపీపీ ప్రవళికా వెంకట్‌రెడ్డి

శంకర్‌పల్లి, ఫిబ్రవరి 28 : శంకర్‌పల్లి వైస్ ఎంపీపీగా ప్రొద్దటూర్ గ్రామానికి చెందిన బొల్లారం ప్రవళికా వెంకట్‌రెడ్డిని ఎన్నికయ్యారు. బుధవారం చేవెళ్ల డీఎల్పీవో సతీష్, ఎంపీడీవో వెంకయ్య ఆధ్వర్యంలో బీఆర్ఎస్ ఎంపీటీసీ సభ్యులు ప్రవళికా వెంకట్‌రెడ్డిని వైస్ ఎంపీపీగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాగా, గతేడాది మిర్జాగూడకు చెందిన వైస్ ఎంపీపీ కురుమ రాములమ్మ మృతిచెందడంతో ఈ ఎన్నికను నిర్వహించారు. ప్రవళిక మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ పెద్దలు తనపై నమ్మకం ఉంచి ఈ అవకాశాన్ని ఇచ్చినందుకు వారికి రుణపడి ఉంటానని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గోవర్ధన్‌రెడ్డి, జడ్పీటీసీ గోవిందమ్మ, ఎంపీటీసీలు యాదగిరి, వెంకట్‌రెడ్డి, నాగేందర్, సరిత, మల్లమ్మ, మేఘన, తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్ చిత్రపటానికి పాలాభిషేకం

- గృహజ్యోతి, మహాలక్ష్మి పథకాల అమలుపై హర్షం

ఆమనగల్లు/తలకొండపల్లి, ఫిబ్రవరి 28 : కాంగ్రెస్ ఆరు గ్యారంటీల్లో భాగంగా గృహ జ్యోతి, మహాలక్ష్మి పథకాల అమలు ను హర్షిస్తూ బుధవారం ఆమనగల్లు పట్టణంలో కాంగ్రెస్ నాయకులు పెద్దఎత్తున సంబురాలు జరుపుకున్నారు. రాజీవ్ చౌరస్తా వద్ద కాంగ్రెస్ మండలాధ్యక్షుడు జగన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కాంగ్రెస్, యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. డీసీసీ ఉపాధ్యక్షుడు శ్రీపాతి శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కాంగ్రెస్ , రాహుల్, రేవంత్, వంశీ, కసిరెడ్డిలకు అనుకూలంగా నినాదాలు చేస్తూ ప్రధాన రహదారిపై ర్యాలీ నిర్వహించారు. పట్టణాధ్యక్షుడు మానయ్య, మండల మాజీ అధ్యక్షుడు మండ్లీ రాములు, బ్లాక్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు ఎంఏ ఖలీల్, యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షురాలు లక్ష్మీ కృష్ణనాయక్, ఎన్ఎస్‌యూఐ మండలాధ్యక్షుడు ఫరీద్, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి అలీం, మండలాధ్యక్షుడు రాజశేఖర్, పట్టణాధ్యక్షుడు శ్రీకాంత్, నాయకులు తదితరులు పాల్గొన్నారు. తలకొండపల్లి మండల కేంద్రంలో మండలాధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో సంబురాలు జరుపుకున్నారు. ర్యాలీ నిర్వహించి సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో పీసీసీ కిసాన్ సెల్ రాష్ట్ర కార్యదర్శి మోహన్‌రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యద ర్శి అంజయ్యగుప్త, ఉపాధ్యక్షుడు భగవాన్‌రెడ్డి, నాయకు లు తదితరులు పాల్గొన్నారు.


తలకొండపల్లి : పాలాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, పాల్గొన్న నాయకులు


ఆమనగల్లు : సీఎం రేవంత్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి, జగన్, తదితరులు

జ్యోతిరావు పూలే విగ్రహ ఏర్పాటుకు విరాళం

కడ్తాల్, ఫిబ్రవరి 28: మండలంలోని చరికొండ గ్రామంలో జ్యోతిరావు పూలే విగ్రహ ఏర్పాటుకు జడ్పీటీసీ జర్పుల దశరథ్ నాయక్ చేయూతనందించారు. బుధవారం మండల కేంద్రంలో నిర్వాహకులకు రూ.10,116 విరాళం అందజేశారు. జ్యోతిరావు పూలే విగ్రహం ఏర్పాటుకు ముందుకు వచ్చిన గ్రామ యువకులను ఆయన అభినందించారు.

ఘనంగా గంప వెంకటేశ్ జన్మదిన వేడుకలు


కేక్ కట్ చేస్తున్న గంప వెంకటేశ్

కడ్తాల్, ఫిబ్రవరి 28: డీసీసీబీ డైరెక్టర్, ఆమనగల్లు పీఏసీఎస్ చైర్మన్, బీఆర్ఎస్ జిల్లా సీనియర్ నాయకుడు గంప వెంకటేశ్ గుప్త జన్మదిన వేడుకలు బుధవారం కడ్తాల మండల కేంద్రంలో నిర్వహించారు. పీఏసీఎస్ ఉప కేంద్రం వద్ద జీవీజీ టీం ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. జడ్పీటీసీ దశరథ్‌నాయక్, వైస్ ఎంపీపీ ఆనంద్, రైతు సమన్వయ సమితి మండలాధ్యక్షుడు జోగు వీరయ్య, జీవీజీ అధ్యక్షులు ఎస్ఎం శ్రీకాంత్, ఆర్యవైశ్య సంఘం, బీఆర్ఎస్ నాయకులతో కలిసి వెంకటేశ్ కేక్‌కట్ చేసి ప్రజలకు పంచిపెట్టారు. పలు సేవా కార్యక్రమాలు నిర్వహించి మొక్కలు నాటారు. ఆసుపత్రుల్లో రోగులకు పాలు, పండ్లు అందజేశారు. కడారి రామకృష్ణ, లాయక్‌అలీ, సేవ్యానాయక్, బెల్లి వెంకటయ్య, శ్రీకాంత్, హర్యానాయక్, అంజి, ఈర్షద్, ఎనుముల రమేశ్, శివ, పాండు, టీక్‌లాల్, లక్ష్మణ్, గణేశ్, వినోద్,పాండు, రమణ,గోపాల్,కృష్ణ, సురేశ్, సతీష్, రామచంద్రయ్య, జగదీశ్, సాయి, ఉపేందర్, రాజు, రామకృష్ణ, నరేంద్ర గుప్త, లక్ష్మణ్ గుప్త, చంద్రయ్య, కిరణ్, దేవేందర్, మహేశ్, పద్మాకర్ తదితరులున్నారు.

వైభవంగా కొనగట్టు శివాలయం వార్షికోత్సవం

చేవెళ్ల, ఫిబ్రవరి 28 : మండల కేంద్రంలోని కొనగట్టు శివాలయం శివనామస్మరణతో మార్మోగింది. బుధవారం కొనగట్టు మల్లికార్జునస్వామి ఆలయ వార్షికోత్సవంలో భాగంగా మొదటి రోజు గణపతి పూజ, హోమం, అఖండ దీపారధన, ధ్వజారోహణం, రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన, మహ మంగళహారతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయకమిటీ సభ్యులు, ప్రధాన అర్చకుడు సురేశ్‌లు శివుడికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం రాజారాజేశ్వరి మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్, ధర్మకర్తలు సున్నపు వసంతం, సున్నపు మాణిక్య ప్రభు, ఆలయ కమిటీ సభ్యులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, భక్తులు, గ్రామస్తులు, మహిళలు తదితరులు ఉన్నారు.


చేవెళ్ల : కొనగట్టు శివాలయంలో పూజలు చేస్తున్న భక్తులు


కొత్తూర్ : గోపుర నిర్మాణం పనుల్లో నాయకులు

శివరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలి

షాద్‌నగర్ రూరల్ : పవిత్ర పుణ్యక్షేత్రం రామేశ్వరంలో శివరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తెలిపారు. పట్టణంలో బుధవారం ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు వెంకట్‌రెడ్డి, ఆలయ చైర్మన్ రవీందర్ రావు, ఈఓ శివకుమార్ పాల్గొన్నారు.

పార్వతీ పరమేశ్వరుల ప్రతిరూపమే బొడ్రాయి

కేశంపేట : పార్వతీ పరమేశ్వరుల ప్రతిరూపమే బొడ్రాయని అని, ప్రజలందరూ బొడ్రాయి కృపకు పాత్రులు కావాలని షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ ఆకాంక్షించారు. మండల పరిధిలోని బొదునంపల్లి గ్రామంలో బుధవారం బొడ్రాయి ప్రతిష్ఠాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక పూజలలో పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో బొడ్రాయికి ప్రత్యేకత ఉంటుందని వివరించారు. పూర్వం పెళ్లిళ్ల సమయంలో బొడ్రాయికి పూజలు చేసి వెళ్లేవారని గుర్తు చేశారు. జడ్పీవైస్ చైర్మన్ గణేష్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మురళీధర్‌రెడ్డి, వెంకటయ్య, శేఖర్, పాండు, లింగారెడ్డి, ఆంజనేయులు గౌడ్, రమేష్ గౌడ్, నారాయణ రెడ్డి, శ్రీశైలంగౌడ్, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.


కేశంపేట : మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్‌కు జ్ఞాపిక అందిస్తున్న బొదునంపల్లి గ్రామస్తులు

భక్తిశ్రద్ధలతో గోపుర నిర్మాణ పనులు

కొత్తూర్ : మున్సిపాలిటీలో దాతల సహకారంతో గ్రామదేవతల ఆలయాల పునర్నిర్మాణంలో భాగంగా బుధవారం మైసమ్మ ఆలయం గోపుర నిర్మాణం పనులను భక్తిశ్రద్ధలతో ప్రారంభించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు బి.దేవేందర్‌యాదవ్ మాట్లాడుతూ మున్సిపాలిటీలోని 8ఆలయాలను దాతల సహకారంతో పున నిర్మాణం పనులు చేపడుతున్నామన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ డోలీ రవీందర్, మాజీ ఎంపీపీ జె.వేణుగోపాల్‌గౌడ్, మాజీ ఎంపీటీసీ యాద య్య, నాయకులు కడెంపల్లి సదానంద్‌గౌడ్, నాగరాజుచారి, రవినాయక్, శ్రీను, ఆంజనేయులు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.


షాద్‌నగర్‌రూరల్ : పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శంకర్

ఉత్సాహంగా 'స్వయం పాలన'

ఆమనగల్లు/కొందుర్గు, ఫిబ్రవరి 28: పట్టణంలోని అరబిందో ఉన్నత పాఠశాలలో బుధవారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థినీ విద్యార్థులు చక్కటి వేషధారణతో తోటి విద్యార్థులకు బోధించిన తీరు చూపరులకు ముచ్చట గొలిపింది. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. సాయంత్రం ప్రిన్సిపాల్ రమణారెడ్డి, అకాడమిక్ అడ్వైజర్ సుధీర్‌రెడ్డిల అధ్యక్షతన బోధనలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అదేవిధంగా విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి తమ తోటి విద్యార్థులకు పాఠాలను బోధించారు. కొందుర్గు మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో బుధవారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తమంగా పాఠాలు బోధించిన వారికి బహుమతులను అందజేశారు. హెచ్‌ఎం ఎ.పుష్ప ఉపాధ్యాయులు పాల్గొన్నారు. కాగా, పాఠశాలకు చెందిన అర్షియా అనే విద్యార్థిని ఇల్లు ఇటీవల షార్ట్ సర్క్యూట్ కారణంగా దగ్ధమైంది. ఈమేరకు ఉపాధ్యాయులందరూ కలసి రూ.21వేల ఆర్థికసాయం అందజేశారు.


ఆమనగల్లు : విద్యార్థులతో ఉపాధ్యాయులు


కొందురు : విద్యార్థులతో ఉపాధ్యాయులు